సాక్షి
జగిత్యాల
బుధవారం । 12 । జూలై । 2023



సంకల్ప యాత్రకు మద్దతు

జగిత్యాల: పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలనే డిమాండ్‌తో చేపట్టిన సంకల్ప యాత్రకు టీఆర్టీఎఫ్ మద్దతు తెలిపింది.



కాంగ్రెస్ పటిష్టతకు పాటుపడాలి

వెల్గటూర్ : కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు పాటుపడాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏకలవ్యనగర్‌లో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాల తనిఖీలతోపాటు అనుమానాస్పద వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 41ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ కాలనీలో గంజాయి విక్రేతలు, గంజాయి తాగే వారితోపాటు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారమందించాలన్నారు. ప్రతీవాహనాదారు అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. కాలనీలో అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే తాము సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీనారాయణతోపాటు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులు

జగిత్యాలఅగ్రికల్చర్: జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీలో జాతీయస్థాయి పోటీలు జరిగాయి. పొలాస వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు కె.అనూష, ఎ.శ్రావణి, నాగేశ్వర్‌సింగ్ మ్యూజికల్ ఫామ్ విభాగంలో క్యాంస పతకం సాధించారు. విజేతలను అసోసియేట్ డీన్ భారతి నారాయణ్ భట్, పరిపాలన అధికారి వెంకటగణేశ్, ప్రొఫెసర్లు గౌరీశంకర్, శేషు, కిక్ బాక్సింగ్ కోచ్ రామాంజనేయులు మంగళవారం అభినందించారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోండి



సమావేశమైన అధికారులు, ప్రతినిధులు

ధర్మపురి: జిల్లాలో 18ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్లు మకరంద్, బీఎస్ లత సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఫారం -6, 7, 8తోపాటు 8ఏ గురించి వివరించారు. వికలాంగులు తమ పేర్లను ఓటరు జాబితాలో న మోదు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అంతకుముందు ప్ర భుత్వ జూనియర్ కళాశాల, ఎస్సీ కాలనీలోని పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించా రు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని తహసీల్దార్‌లు, ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి



బహుమతులు అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో మంగళవారం పర్యావరణ పరిరక్షణ, ఇంటర్నెట్ వాడకం, పోస్టర్ తయారీ వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. సుమారు 30 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలిథిన్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులు వాడాలని సూచించారు. ఇంటర్నెట్ వాడకం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, పిల్లలు గేమ్స్ ఆడేటప్పుడు, బ్యాంక్ అకౌంట్స్, ఇతర అంశాలకు వెళ్లకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఫాతిమా, ఆదిత్య, శ్వేతకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్, ప్రధానోపాధ్యాయుడు రామానుజం తదితరులు పాల్గొన్నారు.

తెరపై పాఠం




పెగడపల్లి పాఠశాలలో డిజిటల్ పద్ధతిన పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు

కరెంట్ లేకున్నా బోధన ఆగదు..

డిజిటల్ విద్యాబోధనకు ఎంపికైన ప్రతీ పాఠశాలకు ఇంటరాక్టివ్ షార్ట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)లు సమకూర్చారు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు మూడు ఐఎఫ్‌పీలు పంపిణీ చేశారు. కరెంట్ సరఫరా నిలిచిపోయినా సుమారు మూడు గంటల పాటు విద్యాబోధన చేసేందుకు వీలుగా యూపీఎస్‌లను కూడా సమకూర్చారు. 75 అంగుళాల పొడవు ఉన్న ఈ ప్యానెల్‌ను రెండు రకాలుగా వినియోగించుకునే వీలుంది. డిజిటల్ తరగతుల బోధనతోపాటు బ్లాక్ బోర్డుగా కూడా వినియోగించవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు.

- వినసొంపైన కంఠం
- కళ్లెదుట కదలాడే చిత్రం
- ఆలోచనలు కలిగించే అంశం
- 105 హైస్కూళ్లలో డిజిటల్ బోధన
- ఉత్సాహంగా బోధిస్తున్న ఉపాధ్యాయులు
- ఆసక్తిగా వింటున్న విద్యార్థులు

మన ఊరు.. మన బడి తొలిదశలో ఎంపికైన పాఠశాలలు



పెగడపల్లి: మన ఊరు.. మన బడి పథకం కింద అన్ని ఆధునిక హంగులు సొంతం చేసుకున్న జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన డిజిటల్ విద్యాబోధన విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలను కలిగిస్తోంది. దశాబ్దాలుగా బ్లాక్‌బోర్డులు, చాక్‌పీసుల రాతలతో కూడిన చదువులకు ముగింపు పలుకుతూ సర్కార్ విద్యాలయాలు సైబర్ వేగంతో ముందుకు దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాలో ఎంపిక చేసిన 105 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ సరికొత్త విధానంతో పాఠం నేర్పేందుకు ఉపాధ్యాయులు కూడా ఉత్సాహం కనబర్చడం గమనార్హం.

గతేడాది పనులకు శ్రీకారం..

- మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు గతేడాది శ్రీకారం చుట్టారు.
- పనుల్లో వేగం పెంచిన అధికారులు.. నిర్దేశిత గడువులోగా పూర్తిచేశారు.
- ఈఏడాది 105 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు డిజిటల్ పద్ధతి విద్యాబోధన అందుబాటులోకి తెచ్చారు.
- తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పుస్తకం ద్వారా బోధించిన పాఠాలను కొందరు విద్యార్థులు పూర్తిగా అర్థంచేసుకోలేక పోయేవారు.
- డిజిటల్ విధానంలో దృశ్య రూపంలో బోధన చేస్తుంటంతో ప్రస్తుతం పాఠం సులభంగా అర్థం చేసుకునే అవకాశం కలిగింది.
- విద్యార్థుల్లో పూర్తిస్థాయిలో విషయ పరిజ్ఞానం పెంపొందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా విద్యాధికారులు చెబుతున్నారు.
- జిల్లావ్యాప్తంగా తొలిదశలో 8, 9, పదో తరగతి చదివే విద్యార్థులకు ఈ విధానం ద్వారా విద్యా బోధన చేస్తున్నారు.
- డిజిటల్ బోధనతో చదువులో వెనుకబడిన విద్యార్థులు సులభంగా అన్ని పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటారని ఉపాధ్యాయులు అంటున్నారు.
- కొత్త విధానం అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

శ్రద్ధగా వింటున్నం



బడిలో డిజిటల్ పద్ధతిన బొమ్మలు చూపిస్తూ పాఠాలు చెబుతున్నరు. ఇలా చెప్పడంతో పాఠాలు ఆసక్తిగా వింటున్నం. పుస్తకాల ద్వారా పాఠాలు చెప్పిన సమయంలో సరిగ్గా అర్థం కాకపోయేది. డిజిటల్ పద్ధతిన చెప్పిన పాఠం మంచిగా అర్థమవుతుంది.

– జి.శివసాయి,
పదో తరగతి, పెగడపల్లి

సంతోషంగా ఉంది



డిజిటల్ ప్యానల్‌పై పాఠం చెప్పడం ద్వారా పాఠ్యాంశాల్లోని బొమ్మలను ప్రత్యక్షంగా చూడగలుగుతున్నం. బొమ్మలు చూపుతూ సార్లు పాఠం చెప్పడం ఈజీగా ఉంది. పాఠాలు ఇంకా వినాలన్న ఆసక్తి పెరిగింది. తెరపై విన్న పాఠం ఎక్కువ రోజులు గుర్తుంటుంది. డిజిటల్ బోధన అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉంది.

– టి.కల్యాణి,
తొమ్మిదో తరగతి, పెగడపల్లి

ఆసక్తి పెరిగింది



డిజిటల్ తెరపై పాఠం చెప్పడం ద్వారా విద్యార్థుల్లో వినాలనే ఆసక్తి మరింత పెరిగింది. ఉదాహరణలతోపాటు బొమ్మలు చూపిస్తూ బోధన చేస్తుండటంతో పాఠం సులభంగా అర్థమవుతంది. తద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు ఎక్కువ రోజులు గుర్తుంటాయి.

– సత్యనారాయణరెడ్డి,
ఉపాధ్యాయుడు, పెగడపల్లి

పారదర్శకంగా అట్రాసిటీ కేసుల విచారణ



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుల నమోదు, విచారణను పారదర్శకంగా చేపట్టాలని సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులపై కేసులు నమోదు చేయాలని, వేగవంతంగా విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. విచారణకు అధికారులు సహకరించాలని, బాధితులకు ఆర్థిక సహాయం అందించాలని కొప్పుల ఈశ్వర్ సూచించారు. యువత వ్యసనాలకు బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 262 ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుల్లో రూ.2.27 కోట్ల వరకు పరిహారం చెల్లించాల్సి ఉండగా, 47 మందికి రూ.54.37 లక్షలు చెల్లించామని మంత్రి తెలిపారు. మిగతా కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లించాల్సి ఉందని చెప్పారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్ మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఆర్డీవోలు మాధురి, వినోద్‌కుమార్, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ రైతులను మోసం చేస్తోంది

ఉచిత కరెంట్‌పై కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. కలెక్టరేట్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉచితాలు వద్దంటున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. పింఛన్లు ఎలా పెంచుతామని ప్రకటించార ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి మూడు గంటలు కరెంట్ ఇస్తే సరిపోతుందంటున్న కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయని ఆయన హెచ్చరించారు.

గోరింటాకుతో ఆరోగ్యం



మెహందీ వేడుకల్లో కలెక్టర్ యాస్మిన్‌బాషా, మహిళలు

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: గోరింటాకుతో మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మహిళా సమాఖ్య ఓటరు అవగాహన నోడల్ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకుంటే మహిళలకు అనారోగ్య సమస్యలు రావని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

అర్హులైన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. 18ఏళ్ల వయసు నిండినవారు ఓటరుగా పేరు నమోదుకు అర్హులన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, మెప్మా అధికారులు, మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత

- డీఎంహెచ్‌వో శ్రీధర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

జగిత్యాల: జనాభా నియంత్రణ అందరి బాధ్యత అని డీఎంహెచ్‌వో శ్రీధర్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మోతెవాడ ఆరోగ్య కేంద్రం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కుటుంబ నియంత్రణ పాటించడం ద్వారా తమ కుటుంబానికే కాకుండా దేశ సంక్షేమానికి దోహదం చేసినట్లవుతుందన్నారు. అత్యధిక జనాభా గల ప్రపంచ దేశాల్లో మొదటిస్థానంలో మన భారతదేశం నిలిచిందన్నారు. కుటుంబ నియంత్రణ కోసం ప్రభుత్వం అనేక పద్ధతులను ప్రవేశపెట్టిందన్నారు. వివాహం చేసుకున్న తర్వాత కనీసం రెండు సంవత్సరాల ఎండతో మొదటి బిడ్డ, రెండోసంతానం కోసం మూడు సంవత్సరాల వ్యవధి పాటించాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా భార్యతోపాటు, పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. మహిళలకు చేసే ట్యూబెక్టమీ కన్నా మగవారికి చేసే వేసక్టమీ ఆపరేషన్ చాలా సులువైందన్నారు. ఈనెల 11 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో ఆరోగ్య సిబ్బంది కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పిస్తారని ఆయన వివరించారు. ఒకేఒక పాప జన్మించిన తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న ఆదర్శ దంపతులకు రూ.వెయ్యి ప్రోత్సాహకంగా అందిస్తామని తెలిపారు. అంతర ఇంజక్షన్ వాడుతున్న ఆదర్శ జంటకు సైతం రూ.వెయ్యి ప్రోత్సాహం అందజేస్తామని ఆయన చెప్పారు. ప్రోగ్రాం అధికారి జైపాల్‌రెడ్డి, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి స్వామి, మలేరియా అధికారి సత్యనారాయణ, డాక్టర్ స్వాతి, శ్రీధర్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



పోటీలను పర్యవేక్షిస్తున్న నరేశ్

జగిత్యాల: ఆటల్లో గెలుపోటములను సహజంగా తీసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నరేశ్ సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం స్పోర్ట్స్ స్కూల్ కోసం ఎంపిక పోటీలు నిర్వహించారు. నరేశ్ మాట్లాడుతూ, స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో నాలుగో తరగతి విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో 20 మంది బాలురు, 18 మంది బాలికలు పాల్గొన్నారని, ప్రతిభ కనబర్చిన 10 మంది బాలికలు, మరో 10 మంది బాలురను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. వీరు ఈనెల 25న జరిగే పోటీలకు హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపిక కానివారు బాధపడకూడదని ఆయన సూచించారు. మరోసారి వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బుధవారం 5వ తరగతి విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జగన్మోహన్‌రెడ్డి వివరించారు.

ఉచిత విద్యుత్ అవసరం లేదనడం అవివేకం

- నేడు నియోజకవర్గంలో ఆందోళనలు
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదనడం అవివేకమని, కాంగ్రెస్ పార్టీ రైతువ్యతిరేక పార్టీ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదని, మూడు గంటల విద్యుత్ చాలని అనడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రైతువ్యతిరేక ఆలోచనా విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బుధవారం ఆందోళనలు చేపడతామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా దిష్టిబొమ్మల దహనంతో పాటు, వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మౌలిక సౌకర్యాల కల్పనపై సమీక్ష

జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మిస్తున్న 4,520 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీల నిర్మాణాలపై హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారులతో మంగళవారం ఉన్నతస్థాయి అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం అంచనాలు తయారుచేసి నిధులు మంజూరు చేయాలని ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కోరారు.

స్తంభాల చెరువులోకి కాళేశ్వరం జలాలు

- ఆనందంలో ఆయకట్టు రైతులు

కోరుట్లరూరల్: యెఖీన్‌పూర్ శివారు స్తంభాల చెరువులోకి కాళేశ్వరం గోదావరి జలాలు మంగళవారం వచ్చిచేరాయి. చెరువుకు జలకళ సంతరించుకోవడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్రీరాంసాగర్ వరద కాలువ రివర్స్ పంపింగ్‌లో భాగంగా వరద కాలువ ద్వారా ప్రాజెక్టులోకి గోదావరి జలాలు తరలివెళ్తున్నాయి. ఇందులో కొన్నింటిని మెట్‌పల్లి మండలం రాంరావుపల్లె శివారు మన్నూర్ కాలువ ద్వారా యెఖీన్‌పూర్ స్తంభాల చెరువులోకి మళ్లించారు. ఈ చెరువు నిండి మాటు కాల్వ ద్వారా కోరుట్ల శివారులోని కంచెరకుంటలోకి నీళ్లు చేరుతాయి. కంచెరకుంట నుంచి అయిలాపూర్ శివారులో గల కుమ్మరికుంటలోకి గోదావరి నీళ్లు చేరే అవకాశం ఉంది. దీంతో ఈ చెరువుల ఆయకట్టు కింద వివిధ పంటలు సాగు చేసే రైతులు.. తమ పంటలకు ఇక ఢోకాలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చెరువులోకి వస్తున్న కాళేశ్వరం నీళ్లు

మాన్నూర్ కాల్వకు గండి..

వరదకాల్వ ద్వారా చెరువులోకి నీళ్లు వచ్చే మాన్నూర్ కాల్వకు గండి పడింది. దీంతో రైతులు తమ సొంత ఖర్చులతో జేసీబీ తీసుకొచ్చి గండి పూడ్చి వేశారు. దీంతో వరద కాల్వ నీళ్లు స్తంభాల చెరువులోకి చేరుతున్నాయి. నాలుగైదు రోజుల్లో చెరువు గోదావరి జలాలతో నిండే అవకాశం ఉన్నట్లు రైతులు తెలిపారు.

హామీలు అమలు చేయండి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు నెలకు రూ.3 వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. వారితో వెట్టి చాకిరీ చేయించుకోవడం దారుణమని ఆయన అన్నారు. ఈసందర్భంగా ఎంఈవో కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి చెన్నవేని దశరథం, నాయకులు విజయలక్ష్మి, అన్నారపు గంగు, అంజవ్వ, మమత తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

పెంచిన వేతనాలు చెల్లించండి

కోరుట్ల: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుతారి రాములు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. నాయకులు కొంక భాగ్య పద్మక్క, పోసక్క, విజయలక్ష్మి, పరమేశ్వరి, సఫియా బేగం, అబిదా బేగం, రజియా బేగం, అక్కవ్వ, సునంద తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ‘వసతి’ కరువు

- హాస్టళ్లలో ప్రవేశాలకు అధికారుల నిరాకరణ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇంటర్ విద్యార్థినులు
- అధికారులు, నాయకుల చుట్టూ తల్లిదండ్రుల ప్రదక్షిణలు



తమకు హాస్టల్ సీటు ఇప్పించాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న విద్యార్థినులు(ఫైల్)

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో బాలికలకు ప్రవేశాలు కల్పించేందుకు కొందరు అధికారులు నిరాకరిస్తున్నారు. హాస్టళ్లలో కనీస వసతులు కల్పించకపోగా.. బడుగు, బలహీనవర్గాల పిల్లలను చదువుకు దూరం చేసేందుకు ఇదో కుట్ర అని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు మారాయట!

- జగిత్యాలలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి.
- వీటిలో ప్రవేశాలు పొందిన బీసీ విద్యార్థినులకు గతంలో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలోని బీసీ బాలికల వసతి గృహంలో ప్రవేశాలు కల్పించేవారు.
- ఈ విద్యా సంవత్సరంలో నిబంధనలు మారాయని అధికారులు చెబుతున్నారు.
- అంతేకాదు.. దరఖాస్తులు నేరుగా స్వీకరించడం లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని బాలికలకు సూచిస్తున్నారు.

విద్యార్థినుల్లో అయోమయం

స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కళాశాలలో తీసుకున్న అడ్మిషన్ నంబరు నమోదు చేయాలి. దీంతో విద్యార్థినులు హాస్టల్‌లో ప్రవేశాలు తీసుకోకముందే.. కాలేజీలో అడ్మిట్ అవుతున్నారు. ఆ తర్వాత హాస్టల్‌లో వసతి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ సమయంలో సీట్లు ఖాళీ లేవని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. వేరే కాలేజీలో ప్రవేశాలు తీసుకుంటే రిజర్వేషన్ ప్రకారం సీటు లభిస్తుందని ఆశపడినా.. అప్పటికే హాస్టల్ దరఖాస్తులో కాలేజీ అడ్మిషన్ నంబరు వేయడంతో మరోసారి దరఖాస్తు చేసే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో ఏం చేయాలో తోచక బాలికలు అయోమయానికి గురవుతున్నారు. మరోవైపు.. తమ పిల్లలకు ఎలాగైనా హాస్టల్‌లో సీట్లు ఇప్పించాలని కోరుతూ తల్లిదండ్రులు అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు జగిత్యాల ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా 53 మంది బాలికలు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేశారు.

ఏటా ఇదే పరిస్థితి..

- జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో చేరేందుకు జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన వెనుకబడిన వర్గాల బాలికలు, ఆదిలాబాద్, మంచిర్యాల తదితర జిల్లాల నుంచి కూడా భారీ సంఖ్యలో వస్తున్నారు.
- అయితే జిల్లా కేంద్రంలో ఇంటర్ కోర్సులు చదివే బాలికల కోసం ప్రత్యేకమైన వసతి గృహం అందుబాటులో లేదు.
- దీంతో ఏటా హాస్టల్‌లో సీటు కోసం అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదు.
- ఒకవేళ.. అనేక అవాంతరాలు అధిగమించి ఎలాగోలా హాస్టల్‌లో సీటు సంపాదిస్తే.. కాలేజీల్లో అప్పటికే అత్యంత ప్రధానమైన సిలబస్ పూర్తవుతోంది.
- తద్వారా హాస్టల్‌లో సీటు లభించినా బాలికలు సిలబస్ నష్టపోవాల్సి వస్తోంది.

ఎస్టీ విద్యార్థినులకు తప్పని తిప్పలు..

ఎస్టీ విద్యార్థినుల కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా వసతి గృహం ఏదీ లేదు. వందలాది మంది ఎస్టీ బాలికలు విద్యాభ్యాసం నిమిత్తం జిల్లా కేంద్రంలోని కళాశాలల్లో చేరుతున్నారు. వీరికి ప్రభుత్వ బీసీ హాస్టల్ లేదా ఎస్సీ హాస్టల్‌లో సీట్లు ఇవ్వడంలేదు. దీంతో వసతి పొందేందుకు విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం పరిమిత సంఖ్యలోని విద్యార్థినులకు మాత్రమే హాస్టల్ అధికారులు సీట్లు కేటాయిస్తున్నారు. దీంతో చాలా మంది గిరిజన బాలికల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీల్లో చదువుకునే బీసీ, ఎస్టీ బాలికల కోసం ప్రత్యేకంగా హాస్టల్ వసతి కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అప్పటిదాకా ప్రస్తుతం ఖాళీగా ఉన్న గురుకుల పాఠశాల భవనం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు


కిషన్‌రెడ్డితో స్థానిక నాయకులు

కథలాపూర్(వేములవాడ): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన కిషన్‌రెడ్డిని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, కథలాపూర్ మండలంలోని నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎండీ ఎక్బాల్, శ్రీరాముల ప్రకాశ్, మేడిపెల్లి గంగాధర్ పాల్గొన్నారు.

ఎల్.రమణకు పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి ఎల్లీరామ్ ఇటీవల మరణించిన విషయం విదితమే. దీంతో ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు మంగళవారం రమణను కలిసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

ఉచిత విద్యుత్ వైఎస్సార్ చొరవే


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్ అనేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చొరవేనని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. టీడీపీ హయాంలో వైఎస్సార్ ఉచిత విద్యుత్‌పై పోరాటం చేస్తుంటే అప్పటి సీఎం చంద్రబాబుతో కలిసి ఇప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యతిరేకించారని విమర్శించారు. మంగళవారం సిరిసిల్లలో విలేకరులతో మాట్లాడారు. అమెరికాలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ వక్రీకరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను తప్పుదోవ పట్టించేలా మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు సరికావని, ఇటువంటి అసంబద్ధ కామెంట్స్ బీఆర్‌ఎస్‌కు ఏమాత్రం సరికాదని సూచించారు. రైతులకు ఉచిత విద్యుత్‌పై తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలను ప్రజలు నమ్మబోరన్నారు. రుణమాఫీలు, ఉచిత ఎరువులు అని నమ్మించిన కేసీఆర్ అధికారంలోకి రాగానే కర్షకులను వంచించారని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి బీఆర్‌ఎస్‌కు చెమటలు పడుతున్నాయన్నారు. ఈక్రమంలోనే రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఉనికిని కాపాడే ప్రయత్నాలు బీఆర్‌ఎస్ చేస్తుందని వారి మాటలను ప్రజలు ఎలాగూ విశ్వసించరన్నారు. ప్రజల పక్షాన నిలిచే కాంగ్రెస్‌పై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలని అధికార పార్టీకి హితవు పలికారు.

కురుమ కులస్తుల నిరసన

వేములవాడరూరల్: కురుమ కులస్తుల కుల దేవత అయిన బీరప్ప ఆలయం వద్ద మర్రిచెట్టు కొమ్మలను ఉద్దేశపూర్వకంగా తొలగించారని నిరసన వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేములవాడ మండలం బొల్లారం గ్రామంలో కురుమ కులస్తులకు చెందిన బీరప్ప ఆలయం వద్ద మర్రిచెట్టు ఉంది. రైతుల పొలాలకు విద్యుత్ లైన్ తీసుకెళ్లే క్రమంలో చెట్టు కొమ్మలు అడ్డువస్తున్నాయని సెస్ సిబ్బంది మంగళవారం తొలగించారు. విషయం తెలుసుకున్న కురుమ కులస్తులు బీరప్పస్వామి ఆ కొమ్మలపై ఉంటాడని, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నరికివేయడం సరికాదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్‌కు వివరించి, బాధ్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. దీనిపై విచారణ చేపడతామని సీఐ హామీ ఇచ్చారు.

పదోతరగతి విద్యార్థి ఆత్మహత్య


అజయ్ మృతదేహం

కోరుటరూరల్: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ శివారు అల్లమయ్యగుట్ట ప్రాంతానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఇప్ప అజయ్(15) మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. అల్లమయ్యగుట్ట ప్రాంతానికి చెందిన ఇప్ప చంద్రయ్య దంపతులకు నలుగురు సంతానం. రెండోకుమారుడు అజయ్ కోరుట్ల మున్సిపల్ పరిధి యెఖీన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అయితే, 15 రోజులుగా అతడు బడికి వెళ్లడంలేదు. అజయ్ పాఠశాలకు రావడం లేదని ఓ ఉపాధ్యాయుడు నాలుగు రోజుల క్రితం బాలుడి తండ్రి దృష్టికి తీసుకెళ్లారు. బడికి తప్పకుండా వెళ్లాలని తండ్రి సోమవారం అజయ్‌కు సూచించారు. అయితే, నోట్స్ రాయడం పూర్తికాలేదని, ఆ తర్వాత బడికి వెళ్తానని అజయ్ తండ్రికి సమాధానం చెప్పాడు. ఈక్రమంలో మంగళవారం కూడా బడికి వెళ్లలేదు. మధ్యాహ్న సమయంలో ఉరి వేసుకోవటానికి ప్రయత్నించగా తల్లితండ్రులు చూసి ఆపారు. సాయంత్రం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కుటుంబసభ్యులు అందరూ బయటకు వెళ్లిపోయారు. ఇదే అదనుగా భావించిన అజయ్ ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. విచారణ జరుపుతున్నామని, పూర్తి వివరాలు తెలియవని పోలీసులు తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట


ఏడుమోటలపల్లితండాలో శీత్లా భవాని వేడుకల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఈశ్వర్ అన్నారు. రాజరాంపల్లి, ఏడుమోటలపల్లి తండాల్లో మంగళవారం జరిగిన శీత్లాభవాని వేడుకలకు ఆయన హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించడమే శీత్లాభవాని పండుగ ఉద్దేశమన్నారు. వ్యవసాయ భూముల్లో గ్రామ దేవతలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేయడం గిరిజనుల ఆనవాయితీ అని అన్నారు. గిరిజన మహిళలు, పురుషులు పాటలు పాడుతూ నృత్యం చేశారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, సర్పంచులు రవినాయక్, సత్తమ్మ, ఎంపీటీసీలు అంజయ్య, రవి, సింగిల్‌విండో చైర్మన్లు రమణారావు, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుపతినాయక్, ఉప సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లారెడ్డి, వెంకన్న, రవి, కరుణాకర్‌రావు, లక్ష్మణ్, ఆనందం, శ్రీనివాసరావు, రాజమల్లు, మోహన్‌రెడ్డి, గంగాధర్, తిరుపతి, రాజేశం పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ అరెస్టు

- నిందితుడు కర్ణాటక రాష్ట్రవాసి


దొంగ అరెస్టు చూపిస్తున్న ఎస్సై చిరంజీవి

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగతనం కేసులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన దెగిలిమడి మహేశ్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా ఫతేపూర్ ప్రాంతానికి చెందిన దెగిలిమడి మహేశ్ 8 నెలల క్రితం జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసులో నిందితుడు. అప్పటి నుంచి పోలీసులకు కనిపించకుండా పరారీలో ఉన్నాడు. మంగళవారం మేడిపెల్లి శివారులో మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా.. సమాచారం అందుకున్న పోలీసులు.. చాకచక్యంగా వ్యవహరించి మహేశ్‌ను పట్టుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కలెక్టరేట్‌లో వీధి కుక్క హల్‌చల్



సిరిసిల్లటౌన్: నిత్యం వందలాది సంఖ్యలో వచ్చిపోయే సందర్శకులతో సందడిగా ఉండే సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం వీధికుక్క హల్‌చల్ చేసింది. మూడంతస్తుల భవంతిలోకి అన్ని ఫ్లోర్లు తిరుగుతూ అక్కడున్నవారిని భయభ్రాంతులకు గురిచేసింది. అసలే వీధికుక్కల కాట్లు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోకి చొచ్చుకు రావడం విమర్శలకు తావిచ్చింది. వివిధ కారణాలతో వచ్చే సామాన్యులను లోపలికి పంపించడంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించే సిబ్బంది కళ్లుగప్పి శునకం భవంతిలోకి రావడం విశేషం. కాగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోకి వీధికుక్క వచ్చి సందర్శకులను భయపెట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు రాచర్లగొల్లపల్లి మూడుగుడుల వద్ద మంగళవారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు.

‘కొమొరెడ్డి’ కుటుంబానికే టికెట్

- వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేసిన అభివృద్ధి శూన్యం
- మాజీ ఎమ్మెల్యే జ్యోతక్క


మాట్లాడుతున్న జ్యోతక్క

మెట్‌పల్లి(కోరుట్ల): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల కాంగ్రెస్ టికెట్‌ను పార్టీ అధిష్టానం కొమొరెడ్డి కుటుంబానికే కేటాయిస్తుందని మాజీ ఎమ్మెల్యే జ్యోతక్క వెల్లడించారు. పట్టణంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేలుగా తాను, తన భర్త రామ్‌లు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతోకృషి చేశామన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మెట్‌పల్లి మున్సిపాలిటీగా మారిందన్నారు. తొలి ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ప్రతీమండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించామని గుర్తుచేశారు. భూపంపిణీ పథకం కింద 1,100 మంది పేదలకు పట్టాలను పంపిణీ చేశామని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కోరుట్ల నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. చుట్టూ ఉన్న ఆర్మూర్, బాల్కొండ, సిరిసిల్ల నియోజకవర్గాలతో పోలిస్తే.. కోరుట్ల అభివృద్ధిలో ఎంతో వెనుకబడి ఉందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు అభివృద్ధికి నిదర్శనమా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేయకుండా తన స్వలాభం కోసమే విద్యాసాగర్‌రావు పాటుపడుతున్నారని దుయ్యబట్టారు. లాభాల్లో నడిచే ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. బీసీ వర్గానికి చెందిన తమకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ వస్తుందని, ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు. సమావేశంలో నాయకులు కొమొరెడ్డి కరం, విజయ్ ఆజాద్, ఎర్రాల హన్మాండ్లు, షాకీర్, యామ రాజయ్య, కుత్బుద్దీన్, చెరుకు సమ్మయ్య, రజాక్, కట్కం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పటిష్టతకు పాటుపడాలి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


కార్యవర్గాన్ని అభినందిస్తున్న అడ్లూరి లక్ష్మణ్

వెల్గటూర్(ధర్మపురి): మొక్కట్రావుపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూస లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా సంగెం కుమార్, ప్రధాన కార్యదర్శిగా అవునూరి చిన్నయ్య, కార్యదర్శులుగా సంగెం దేవయ్య, గోళ్ల ఆనంద్, బీసీ సెల్ అధ్యక్షుడిగా బుద్దె రవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మేకల నరేశ్, రైతు విభాగం అధ్యక్షుడిగా బుద్దె సతీష్, యూత్ అధ్యక్షుడిగా అరిగెల మహేశ్ ఎన్నికయ్యారు. అనంతరం పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలు పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి రమేశ్, సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ..

శాకాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పంజాల నారాయణ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని అడ్లూరి ఆకాంక్షించారు.

చిన్నపాటి నిర్లక్ష్యం.. రూ.2.47 లక్షలు మాయం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- ఛేదించిన పోలీసులు.. డబ్బు రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్‌కుమార్

కోనరావుపేట(వేములవాడ): చిన్నపాటి నిర్లక్ష్యంతో బ్యాంకు ఖాతాలోని రూ.2.47 లక్షలు మాయమయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో విచారణ జరిపిన పోలీసులు కేసును ఛేదించి డబ్బు రికవరీ చేశారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ మంగళవారం వివరాలు వెల్లడించారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ప్రశాంత్ బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లాడు. అక్కడి నుంచి కోనరావుపేటలోని తన బ్యాంకు ఖాతాకు డబ్బులు పంపిస్తే తండ్రి పోచయ్య ఏటీఎం కార్డు ద్వారా డ్రా చేసుకుని వాడుకునేవారు. ఈక్రమంలో పోచయ్య ఇంటి వద్ద ప్రహరీ నిర్మాణానికి నిశ్చయించగా, ప్రశాంత్ తన ఖాతాలోని రూ.2.47 లక్షలు వాడుకోవాలని సూచించాడు. నెల క్రితం బ్యాంకు ఏటీఎంకు వెళ్లి చూడగా డబ్బు లేవని చూపెట్టింది. ఖాతాలో గుర్తుతెలియని వ్యక్తులు డబ్బు డ్రా చేశారని తెలుసుకున్న పోచయ్య కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా ఏపీలోని పార్వతీపురం జిల్లా ఉద్దవోలు గ్రామానికి చెందిన కర్రి నవీన్‌కుమార్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు. నవీన్ ఫిబ్రవరిలో జియో సిమ్ (93461 91678) తీసుకున్నాడు. ఏప్రిల్‌లో రూ.లక్ష జమ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వెళ్లింది. నవీన్ తనఖాతాలో చెక్ చేసుకోగా డబ్బులు జమకాలేదు. తర్వాత రూ.వెయ్యి ఇంట్రస్ట్ జమ అయినట్లు వచ్చింది. రెండోసారి కూడా డబ్బు జమకాకపోయేసరికి జియో సెంటర్ ద్వారా పేటీఎం అకౌంట్ క్రియేట్ చేసుకుని చూడగా ప్రశాంత్ బ్యాంక్ అకౌంట్‌కు లింక్ అయినట్లు, అందులో రూ.2.47 లక్షలు ఉన్నట్లు తెలుసుకున్నాడు. దీంతో జియో సెంటర్ ద్వారా పేటీఎం నుంచి పలు దఫాలుగా రూ.2.47 లక్షలు డ్రా చేసుకున్నాడు. కాగా 93461 91678 సెల్‌నంబర్‌ను ప్రశాంత్ మస్కట్‌కు వెళ్లకముందు వాడి ఆ తర్వాత వాడలేదు. ఈక్రమంలో నంబర్‌ను జియో కంపెనీ నవీన్‌కు కేటాయించింది. నవీన్ డ్రా చేసుకున్న డబ్బుతో జల్సాలు చేస్తూ హైదరాబాద్ వెళ్తుండగా వరంగల్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమాకాంత్ వివరాలు వెల్లడించారు. ఎవరైనా తమ మొబైల్‌ను వాడకుంటే దానికి లింక్ అయి ఉన్న బ్యాంక్ అకౌంట్, డిజిటల్ పేమెంట్లలో డీయాక్టివేట్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన సీఐ, ఎస్సై రమాకాంత్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ దండి నరేశ్ ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి అభినందించారు.

ఒబులాపూర్ చేరిన గల్ఫ్ మృతదేహం


బోయిని అనిల్‌కుమార్(ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ దేశంలో బలన్మరణానికి ఒడిగట్టిన బోయిని అనిల్‌కుమార్(34) మృతదేహం మంగళవారం ఒబులాపూర్ గ్రామానికి చేరింది. కుటుంబసభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌కు ఒబులాపూర్ గ్రామానికి చెందిన సునీతను ఇచ్చి 13 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. ఇందుకోసం కొంత అప్పు చేశారు. ఈ దంపతులకు ఒక కుమార్తె ఉంది. అయితే, వివాహం కోసం చేసిన అప్పును తీర్చేందుకు, మెరుగైన ఉపాధి కోసం మరికొంత అప్పు చేసిన అనిల్‌కుమార్.. 11 ఏళ్ల క్రితం బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో పనికి కుదిరాడు. తక్కువ జీతమైనా గత్యంతరం లేక అదే పనిచేస్తూ అక్కడే ఉండిపోయాడు. వేతనం తక్కువగా రావడంతో అప్పు తీర్చేదారి కనిపించలేదు. ఆర్థిక ఇబ్బందులు అధికం అయ్యాయి. మనస్తాపం చెందిన అనిల్‌కుమార్ ఈనెల 7న అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డు. అక్కడి భారతీయులు ఈ సమాచారం చేరవేయడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడి రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించారు. వీరికి ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ చొరవ తీసుకుంది. ఐదు రోజుల తర్వాత మృతుడి భార్య సునీత తల్లిగారి గ్రామమైన ఒబులాపూర్‌కు మంగళవారం చేరింది. మృతదేహాన్ని చూసిన కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామ శివారులో అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

భక్తిశ్రద్ధలతో శీత్లాభవాని వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

రాయికల్(జగిత్యాల): దావన్‌పల్లి, చింతలూరు గ్రామాల్లో శీత్లాభవాని వేడుకలు గిరిజన బంజారులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజన మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యమున, ఉపసర్పంచ్ బిక్కునాయక్, ఎస్టీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బిక్కునాయక్, లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సురేందర్ నాయక్, మండల అధ్యక్షుడు తిరుపతినాయక్ పాల్గొన్నారు.

పాడిపంటలు సమృద్ధిగా పండాలి


పూజలు చేస్తున్న గిరిజనులు

మల్లాపూర్(కోరుట్ల): వాల్గొండ తండా శివారు అటవీ ప్రాంతాల్లో మంగళవారం గిరిజనులు శీత్లా భవాని(దాటుడు) వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తమ దేవతలు శీత్లాభవాని, తుల్జాభవాని, మసూరిభవాని, అంబాభవాని, దుర్గాభవాని మాతలకు పరమాన్నం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ పిల్లాపాపలను సల్లంగా చూడాలని, పాడిసంపద, పశువులు బాగుండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. సర్పంచ్ ధరంసోత్ కళావతి, ఎంపీటీసీ క్యాతం సుజాత, ఉపసర్పంచ్ ఇస్లావత్ లక్ష్మి, నాయకులు క్యాతం నరేశ్‌రెడ్డి, దండిక రాజన్న, ధరంసోత్ సురేందర్, ఇస్లావత్ బలరాంనాయక్, బా నోవత్ శ్రీనివాస్ నాయక్, శంకర్‌నాయక్, లావుడ్యా శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంకటాపూర్ మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. మానేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అటుగా ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్లను ఆపి అనుమతి పత్రాల కోసం విచారించగా ఎలాంటి అనుమతులు లేవని తెలియడంతో ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.